www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 19 జులై 2025
5
తిరుపతి



మేర్లపాక పాఠశాలను విలీనం చేయొద్దు

ప్రజాశక్తి -ఏర్పేడు బడుల విలీన ప్రక్రియలో భాగంగా ఏర్పేడు మండలంలోని మేర్లపాక ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతుల విద్యార్థులను 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న మన్నసముద్రం పాఠశాలలో విలీనం చేస్తూ విద్యాశాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు నెల క్రితమే విలీన ప్రక్రియను వ్యతిరేకిస్తూ నిరసనలు చేపట్టారు.తమ పిల్లలు మన్నసముద్రం పాఠశాలకు వెళ్లాలంటే అత్యంత రద్దీగా ఉన్న పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిని ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని దాటాల్సిన పరిస్థితి, వెళ్లే మార్గంలో స్మశానాలు, నీటి గుంటలు, చెరువు ఉండడంతో ఎప్పుడు ఎలాంటి దుస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం అధ్యక్షులు రంగయ్య, నాయకులు హేమాద్రి మేర్లపాక ప్రాథమిక పాఠశాలను సందర్శించి మాట్లాడుతూ గతంలో నాడు-నేడు ద్వారా పాఠశాలను పునరుద్ధరించి కావలసిన తరగతి గదులను, ప్రహరీ నిర్మాణం, నీటి సదుపాయం, బాత్రూమ్స్, ప్లే గ్రౌండ్ వంటి మౌలిక వసతులతో ఆధునికరించారని, అలాంటప్పుడు ఈ స్కూలును ఎందుకు విలీనం చేస్తున్నారని ఎంఈఓకు ఈ అభివృద్ధి కనపడలేదా అని ప్రశ్నించారు. తక్షణమే ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



వర్షం పడిందంటే కాల్వల్లోనుంచి గుట్టలు గుట్టలుగా చెత్త



చిన్నపాటి వర్షానికే ఇళ్లల్లోకి డ్రైనేజీ నీరు

'స్మార్ట్' తిరుపతి
చూడాల్సిందే 'అధిపతి'

తిరుపతి వీధులన్నీ 'గబ్బు గబ్బు'

లోతట్టు ఇళ్లవారికి యాతనే..

వర్షం వ్యథ ఇంతింత గాదయా..

చంద్రబాబూ.. ఇది మా గోడు

'స్వచ్ఛ సూపర్ లీగ్' అవార్డులు తిరుపతి కార్పొరేషన్ ప్రతిష్ట ఇనుమడింపజేసేలా కార్యాలయంలో వేలాడుతూ ఉంటాయి.. తాజాగానూ రెండు రోజుల క్రితమే రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా కమిషనర్ మౌర్య, మేయర్ డాక్టర్ శిరీష మరోమారు ఈ అవార్డును అందుకున్నారు. కార్పొరేషన్లకు నిధులివ్వని కేంద్రం 'పురస్కారాలతో' అందల మెక్కిస్తుండటం ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోంది.. తిరుపతికి పెద్ద సమస్యగా మారిన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ బాగు చేయాలంటే 300-400 కోట్లు ఖర్చు అవుతుందని ఇంజినీరింగ్ అధికారులు అంచనాలు తయారు చేయడమే తప్ప కేంద్రం గానీ, రాష్ట్రం గానీ ఒక్క పైసా విదిల్చిన పాపాన పోలేదు. ఈ కారణంగా తిరుపతి నగరం 'గబ్బు' కొడుతోంది.. వర్షం వస్తే వీధుల్లో నడవడం కష్టమే. మురికివాడలైతే చిన్నపాటి చెరువులను తలపిస్తాయి. వర్షం వచ్చిన ప్రతిసారీ లోతట్టు ఇళ్లున్న వారికి 'యాతనే'.

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి స్మార్ట్‌సిటీగా పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి అవసరమైన రూ.400 కోట్లు కార్పొరేషన్ వద్ద లేకపోవడంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల కోసం వేచి చూస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్‌సిటీ పథకం కింద రూ.405 కోట్లు ఇవ్వాల్సి ఉంది. వైసిపి హయాంలోనూ స్మార్ట్‌సిటీ నిధులేమీ ఇవ్వలేదు. కూటమి హయాంలోనూ అదే పరిస్థితి. దీంతో వర్షం వచ్చిన ప్రతిసారీ వీధులు శుభ్రం చేయడానికి పారిశుధ్య కార్మికుల నడుములు పడిపోతాయి. 30 సంవత్సరాల క్రితం నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. వర్షం వచ్చిందంటే చాలు కార్పొరేషన్ అధికారులను జనం తిట్టుకుంటూ ఉంటారు. అయితే నిధులివ్వని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాగానే ఉన్నాయి. ముఖ్యంగా తిరుమల కొండకు ఆనుకుని ఉన్న సప్తగిరినగర్, రైల్వేకాలనీ, సుందరయ్యనగర్; మధురానగర్; శివజ్యోతినగర్, ఎర్రమిట్టతో పాటు లక్ష్మీపురం సర్కిల్‌లోనూ వర్షాలకు రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. తిరుమలకు తలమానికంగా ఉన్న తిరుపతి అభివృద్ధికి టిటిడి నిధులు కేటాయించాలని వామపక్షాలు డిమాండ్ చేసిన ప్రతిసారీ బిజెపి మోకాలడ్డుతూనే ఉంది. ఫలితంగా భక్తులు మురుగునీటిలోనే తిరుమలకు వెళ్లాల్సి వస్తోంది. వర్షం వచ్చిందంటే 80శాతం కాలనీలు మురుగులోనే. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం పర్యటనలోనైనా తిరుపతి మురుగు సమస్యకు పరిష్కారం చూపాల్సి ఉంది.

నేడు తూకివాకం వద్ద సిఎం పరిశీలన

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తూకివాకం వద్ద ఉన్న మురుగునీటి శుద్ధిప్లాంట్‌ను స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిశీలించనున్నారు. ప్రధాన మురుగు పైపులైను అక్కడే ఉంది. అధికారులు ఈ సమస్యను సిఎం దృష్టికి తీసుకెళితే కొంతవరకైనా నిధులు కేటాయించే అవకాశం ఉందని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే కార్పొరేషన్ అధికారులు కేంద్రం దృష్టికి మురుగు సమస్యను తీసుకెళ్లారు. రెండు సార్లు కేంద్రబృందాలు వచ్చి చూసి వెళ్లాయి. మరో 40 కోట్లు ఇస్తే రేణిగుంట నుంచి తిరుపతి వరకూ ప్రధాన మురుగునీటి పైప్‌లైన్ మార్చడానికి ఆస్కారం ఉంటుందని ఇంజినీరింగ్ అధికారులు సూచిస్తున్నారు. కేంద్ర బృందం హామీ ఇచ్చి వెళ్లింది. చంద్రబాబు సైతం భరోసా ఇస్తే తాత్కాలికంగా అయినా మురుగు సమస్యకు ఉపశమనం కలుగుతుంది.

తుడాకు శెట్టిపల్లి జీవో వచ్చేనా

శెట్టిపల్లి వాసుల గోడు వర్ణనాతీతంగా ఉంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి తుడాకు బదలాయిస్తూ జీవో ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం ఏడాది నుంచి మీనమేషాలు లెక్కిస్తూనే ఉంది. శెట్టిపల్లి వాసులు గత 20 సంవత్సరాల నుంచి తమకు న్యాయం చేయాలని కోరుతున్నా శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదు. ఎన్నికల్లో మాత్రమే శెట్టిపల్లి వాసుల ఓట్లు కావాలే తప్ప వారి సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వాలు చొరవ చూపడం లేదు. శెట్టిపల్లి వాసులు కూడా ఈ ప్రభుత్వాలపై నమ్మకం కోల్పోతున్నారు. తిరుపతికి వస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని శెట్టిపల్లి వాసులు కోరుతున్నారు

కమాండ్ కంట్రోల్ భవనానికీ నిధుల కొరత

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఖజానాలో నిధులు లేకపోవడంతో పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం కూల్చి కొత్త కార్యాలయాన్ని వైసిపి ప్రభుత్వం 71 కోట్లతో పనులు చేపట్టారు. ఈ బిల్డింగ్ పూర్తి వరకు 92 కోట్లుగా చేర్చడం జరిగింది. ఇప్పటివరకు 45 శాతం పనులు పూర్తయ్యాయి. కాంట్రాక్టర్కు 16 కోట్ల రూపాయలు మాత్రమే బిల్లులు చెల్లించారు. స్మార్ట్ సిటీ పథకం ముగిసిపోవడంతో కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చే పరిస్థితి లేదు. రాష్ట్ర ప్రభుత్వం కమాండ్ కంట్రోల్ బిల్డింగ్ నిర్మాణానికి మిగిలిన నిధులు కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు. తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ స్థలాన్ని అమ్మకానికి పెట్టి వీటిని నిర్మించాలని కౌన్సిల్లో అజెండాలో అధికారులు పెట్టిన వాటిని కౌన్సిల్ తిరస్కరించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్త మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నిర్మించడానికి కావలసిన నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

నేడు సీఎం చంద్రబాబు తిరుపతికి రాక

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా తిరుపతికి రామన్నారు. ఉదయం 10 గంటలకు ఇంటినుంచి బయల్దేరి ఉదయం 11 గంటలకు తిరుపతి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఉదయం 11:15 నిమిషాలకు విమానాశ్రయంలో పలువురు అధికారులతో కలవనున్నారు. ఉదయం 11.30 గంటలకు రేణిగుంట మండలం తూకివాకం వద్ద ఉన్న స్టాంప్ వాటర్ డ్రైనేజీ పరిశీలిస్తారు. ఉదయం 11.30 నుంచి 12 గంటలకు తూకివాకం వద్ద ఉన్న చెత్తతో ఎరువులు తయారు చేసే కార్యక్రమాన్ని పరిశీలిస్తారు. దాంతోపాటు వ్యర్థాలతో తయారీ బ్రిక్స్‌ను పరిశీలిస్తారు. 12 గంటల 15 నిమిషాలకు తిరుపతి కపిలతీర్థం వద్దకు వచ్చి సీఎం చంద్రబాబు నాయుడు దర్శనం చేసుకుంటారు. మధ్యాహ్నం 12:30 నుంచి ఒంటిగంట వరకు స్వచ్ఛంద, స్వర్ణాంధ్ర, వాటాదారులతో ఇంట్రాక్ట్ అవుతారు. . ఒంటిగంట 15 నిమిషాలకు పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ బంగారు కుటుంబాల సంబంధించిన వారితో సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతారు. మధ్యాహ్నం 2 నుంచి మూడు గంటల 45నిమిషాలకు ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటారు. నాలుగు గంటలకు అలిపిరి వద్ద కంచి కామకోటి పీఠం మహా పాదుక మండపం చేరుకుంటారు. అక్కడ దర్శనం చేసుకుని మధ్యాహ్నం 4: 30 గంటలకు రేణిగుంట ఎయిర్ పోర్టుకు బయలుదేరుతారు. ఐదు గంటలకు రేణుగుంట ఎయిర్పోర్ట్ నుంచి విజయవాడ ఎయిర్పోర్ట్ కు బయలుదేరి వెళ్తారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ముందస్తు భద్రత ఏర్పాట్లపై కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పర్యటన ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. కపిలేశ్వర స్వామి వారి ఆలయానికి చంద్రబాబు రానున్న నేపథ్యంలో టిటిడి ఈవో జె.శ్యామలరావు అధికారులతో కలిసి పరిశీలించారు.

కరెంట్ కావాలంటే 'ముందే' కొనుక్కోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - పిచ్చాటూరు



విద్యుత్‌రంగంలో స్మార్ట్ మీటర్ల పేరుతో కరెంట్‌ను ముందే కొనుక్కునే పరిస్థితి మనకు రానుందని, ఇదేగనక జరిగితే ప్రతినెలా స్మార్ట్ ఫోన్లకు ముందే రీఛార్జి చేసుకున్నట్లే, స్మార్ట్ విద్యుత్ మీటర్లకూ ముందే రీఛార్జి చేసుకుని కరెంట్‌ను కొనుక్కోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు అన్నారు. స్మార్ట్ మీటర్లను పగలగొట్టి, పాత మీటర్లను కొనసాగించుకుంటేనే కరెంట్ భారాలు తప్పుతాయన్నారు. లేదంటే ప్రస్తుతం వేస్తున్న ట్రూఅప్ ఛార్జీలతో పాటు, 'స్మార్ట్' మీటర్ భారాలను మనం మోయాల్సి ఉంటుందన్నారు. విద్యుత్ ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లిపోతే 'స్విచ్' వేయాలంటే కూడా భయపడే రోజులు భవిష్యత్‌లో వస్తాయన్నారు. అదానీకి దాసోహం అంటూ కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని చంద్రబాబునాయుడు స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించడానికి సన్నద్ధమయ్యారన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మెలుగు రమేష్, జిల్లా కమిటి సభ్యులు నాగలాపురం నాగరాజు, వెంకటేష్, రాజేశ్వరి, వరలక్ష్మి, మురగేష్, అముద, లక్ష్మయ్య, శంకరయ్య, మునస్వామి పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలకు జీవోలు ఎక్కడ?

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - నాయుడుపేట, తిరుపతి టౌన్, సూళ్లూరుపేట

ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని, గత సమ్మెకాలంలో ఇచ్చిన హామీలకు జీవోలను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం నాయుడుపేటలో బైక్‌ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. యూనియన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య, సిఐటియు కార్యదర్శి శివకవి ముకుంద మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు సమ్మెకాలపు ఒప్పందాలకు జీతాలివ్వాలని, ఆరు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలో ఉన్నా పాలకులకు పాట్టడం లేదన్నారు. తమ డిమాండ్లునెరవేరే వరకూ ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సీనయ్య, నాగరాజు, రామచంద్రయ్య, కాలేషా, రవి, వీరాస్వామి పాల్గొన్నారు.

తిరుపతిలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సిఐటియు నగర నాయకులు టి.సుబ్రమణ్యం, వేణుగోపాల్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో ఇంజినీరింగ్ కార్మికుల పాత్ర కీలకమని అన్నారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో దాదాపు 600 మంది తెలుగుగంగ డిపార్టుమెంట్, ఎలక్ట్రికల్, డేటా ఆపరేటర్స్, రెవెన్యూ, ఫైర్, టౌన్‌ప్లానింగ్, యుడిఎస్, ఆఫీసుల్లో విధులు నిర్వహిస్తున్నా ఇంతవరకూ గుర్తింపు కార్డులు లేవన్నారు. కమిషనర్‌కు వినతిపత్రం ఇవ్వగా, గుర్తింపు కార్డులు ఇస్తామని



హామీ ఇచ్చారు. జీతాల విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని చెప్పారు. నాయకులు టి.రామకష్ణ, పి.బుజ్జి, పి.చిన్న, బి.శ్రీరాములు, టి.దాసు, పి.వాసు, మురళి, శ్రీను, సత్య, నరసింహులు, ఖాదర్ వల్లీ, మహ్మద్ అలీ, ప్రసాద్, రాము పాల్గొన్నారు.

– సూళ్లూరుపేటలో శిబిరంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నాయకులు ఎస్కె రియాజ్, కె.సాంబశివయ్య, సిహెచ్ చంద్రశేఖర్, బి.పద్మనాభయ్య, అక్బర్‌బాష, వెంకటరత్నం, రామయ్య, కరీం, మురళి, బాబు పాల్గొన్నారు.

– శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు జిల్లా నాయకులు అంగేరిపుల్లయ్య, మునిరాజా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జీవో 36ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్‌చేశారు. కేటగిరీల నిర్ణయంలో జరిగిన పొరపాట్లను జీఓ ఎంఎస్ నెం.11 ద్వారా సరిదిద్దాలని కోరారు. షరతులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులందరికీ అమలుచేయాలన్నారు. జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి, వెంకటేష్, గురునాధం తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల ప్రైవేట్ ఏజెన్సీల దోపిడీ

ప్రజాశక్తి -ఏర్పేడు

ఈ ఏడాది విస్తారంగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ప్రకటించడం, ముందుగానే రుతుపవనాలు ప్రవేశించడంతో బోరు బావులున్న రైతులు గతేడాది కంటే ఈసారి ఖరీఫ్ సాగులో ఏర్పేడు మండలంలో సుమారు 6 వేల ఎకరాలలో వివిధ రకాల పంటలు వేశారని వ్యవసాయ అధికారులు తెలిపారు. పంట ఏపుగా పెరిగేందుకు నత్రజని కీలకపాత్ర పోషిస్తుంది. అందుకోసం యూరియా వినియోగం తప్పనిసరి. కాంప్లెక్స్ ఎరువులు వేయాలన్నా యూరియాతో కలిపి వేస్తేనే పొలంలో సమపాలంగా పంటకు అందుతుంది. అయితే మండలంలో వున్న 17 రైతు సేవ కేంద్రాలలోనూ, సొసైటీలోను యూరియా లేకపోవడంతో రైతులు ప్రైవేట్ ఏజెన్సీల బాట పడుతున్నారు. దీనిని అదునుగా తీసుకొని ప్రైవేట్ ఏజెన్సీలు కత్రిమ కొరత సష్టించి యూరియా కావాలంటే కాంప్లెక్స్ ఎరువులు, పురుగు మందులు కొనాల్సిందేనని తెగేసి చెబుతున్నారు. దీంతో ప్రస్తుతం అవసరంలేని ఎరువులు రూ. 2 వేలు నుండి రూ.3 వేల వరకూ వెచ్చించి కొనుగోలు చేయలేక రైతులు వెను తిరుగుతున్నారు.



రైతులకు షరతులు లేకుండా యూరియా ఇవ్వాలి : రైతుసంఘం

మండలంలో ఏర్పేడు, పాపానాయుడుపేట, పల్లంపేట లోని ప్రైవేట్ ఏజెన్సీలు రైతులకు సరిపడినంత యూరియా సరఫరా చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రంగయ్య, పి.హేమలత డిమాండ్ చేశారు. రైతులు యూరియా కోసం ప్రైవేట్ ఏజెన్సీల వద్దకు వెళితే పురుగు మందులు, కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేయడం సరికాదని అన్నారు. ఈ సమస్యను సంబంధిత వ్యవసాయ అధికారులు పరిష్కరించి రైతు సేవ కేంద్రాలు, సొసైటీ, ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా రైతులకు సరిపడినంత యూరియాను సరఫరా చేయాలని, లేకపోతే జిల్లా వ్యాప్తంగా పోరాటాలు ఉధృతం చేస్తామని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వెంకటాద్రి, చిన్న కష్టారెడ్డి తదితర రైతుల పాల్గొన్నారు.

'మంగళం-శెట్టిపల్లి' రూట్ 'లేట్'

తెలుగుగంగ లీకేజీలతో దీర్ఘకాలిక ఆలస్యం
మంచినీటిలో కలుస్తున్న మురుగునీరు
4 రోజులుగా సరఫరా కాని తాగునీరు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

దశాబ్దాల కాలంగా మంగళం ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న మంగళం-శెట్టిపల్లి రోడ్డు నిర్మాణం అడుగడుగున అవాంతరాలతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఈ మార్గం గుండా దామినేడు, రేణిగుంట, ఉప్పరపల్లి ప్రాంతాలకు తెలుగంగ నీటిని సరఫరా చేసే నీటి పైపులైనులు ఉండటంతో వాటి లీకేజీలు కారణంగా ఈ మార్గ నిర్మాణ పనులు అడుగడుగున ఆలస్యం అవుతోంది. లీకేజీలు సరి చేసే క్రమంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని, అందుకే లీకేజీ సరి చేసిన ప్రాంతంలో మళ్లీ లీకేజీ అవుతోందని స్థానిక ప్రజలు విమర్శిస్తున్న పరిస్థితి. గత ప్రభుత్వ హయాంలో అప్పటి టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఈ రోడ్డు నిర్మాణ పనులను చేయడానికి టిటిడి నిధులను మంజూరు చేయించారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు మొదటగా ఈ మార్గంలో ఉన్న చెట్లను తొలగించి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. మొదట్లో వేగవంతంగా సాగిన మంగళం-శెట్టిపల్లి రోడ్డు మార్గం పనులు తెలుగు గంగ లీకేజీలు కారణంగా ఆలస్యంగా జరిగాయి. అటు తరువాత లీకేజ్ లను తెలుగుగంగ ప్రాజెక్టు అధికారులు సరి చేయడంతో కొంత భాగం గ్రావెల్ తోలి మంగళం రవాణా శాఖ కూడలి నుండి శెట్టిపల్లి రైల్వే గేట్ వరకు ఒక రూపును తీసుకువచ్చారు. అటు తర్వాత ప్రభుత్వం మారడం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొన్నాళ్లపాటు పనులు ఆగిపోయాయి. మళ్లీ గుత్తేదారు టీటీడీ ఇంజనీరింగ్ అధికారులను సంప్రదించి వర్షాకాలంలోపు మంగళం-శెట్టిపల్లి రోడ్డు మార్గం నిర్మాణానికి సంబంధించి కల్వర్టులను పూర్తి చేయాలని కోరగా అధికారులు ఇందుకు సంబంధించిన అనుమతులు ఇచ్చారు.

ప్రస్తుతం కల్వర్టు నిర్మాణం.....

మంగళం-శెట్టిపల్లి మార్గంలో కాలాతీతమైన కల్వర్టును తొలగించి దాని స్థానంలో నూతన కల్వర్టును నిర్మించడానికి గుత్తేదారు రమేష్ నాయుడు పనులు ప్రారంభించారు. అయితే గురువారం సాయంత్రం నుండి కురిసిన వర్షానికి కల్వర్టు నిర్మాణ ప్రాంతం గుండా శెట్టిపల్లికి వెళ్లే తిరుపతి ఇరిగేషన్ కాలువ నీరు పారడంతో మంగళం శెట్టిపల్లి మార్గంలో వాహనాల రాకపోకలకు అసౌకర్యం ఏర్పడింది. వర్షం ఇలానే రెండు రోజులు పడితే పూర్తిగా రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందని శెట్టిపల్లి మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. నీరు తగ్గు ముఖం పట్టగానే పనులు వేగవంతంగా పూర్తి చేస్తామని గుత్తేదారు రమేష్ నాయుడు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

గంగ గుండా మురుగునీరు.....

కల్వర్టు నిర్మాణం చేపట్టిన ప్రాంతంలో ఏర్పడిన తెలుగుగంగ లీకేజీ కారణంగా తెలుగు గంగ పైపులోకి మురుగునీరు చేరి సరఫరా అవుతోంది. దీనివల్ల రోగాల పాలు అయ్యే అవకాశం ఉందని, గతంలోనూ ఇలానే జరిగిందని ఇప్పటికైనా తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ దష్టి సారించి శెట్టిపల్లికి ఇతర ప్రాంతాలకు సరఫరా అవుతున్న తెలుగు గంగ లీకేజ్ ని తెలుగుగంగ ప్రాజెక్టు అధికారులతో సంప్రదించి శరవేగంగా మరమ్మత్తులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

4 రోజులుగా శెట్టిపల్లికి సరఫరా కాని గంగ.....

తెలుగు గంగ లీకేజీ కారణం చేత గత నాలుగు రోజులుగా శెట్టిపల్లికి తెలుగు గంగ నీటి సరఫరాను ఆపేశారని, తాగునీటికి, వినియోగ నీటికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని శెట్టిపల్లి గ్రామ ప్రజలు వాపోతున్నారు. గతంలో పంచాయతీలో ఉండే సమయంలో ఎప్పుడు నీటికి ఇక్కట్లు లేవని, ఎప్పుడైతే నగరపాలక సంస్థలో విలీనం చేశారో అప్పటి నుంచి శెట్టిపల్లి గ్రామంలో పారిశుద్ధ్య సమస్య, తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు చెబుతున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ స్పందించి కనీసం ట్యాంకర్లతో ఆయన స్థానిక ప్రజల అవసరాల నిమిత్తం నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కల్వర్టు నిర్మాణం ప్రదేశంలో లీక్ అవుతున్న తెలుగు గంగ





సత్యవేడు నియోజకవర్గంలో ఎంఎల్ఏది ఓ రూటు, కన్వీనర్లది మరో రూటు

సత్యవేడు టిడిపిలో అనిశ్చితి

తలలు పట్టుకుంటున్న తెలుగు తమ్ముళ్లు
ఎంఎల్ఏ కోనేటి ఆదిమూలంపై అసహనం

ప్రజాశక్తి - కెవిబిపురం

సత్యవేడు టిడిపిలో అనిశ్చితి నెలకొంది. ఎంఎల్ఏ కోనేటి ఆదిమూలం నాడు వైసిపిలో ఉన్నా, నేడు కూటమిలో ఉన్నాడో లేడో తెలియకున్నా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. నియోజకవర్గంలోని ఏడు మండలాలలో తెదేపా పరిస్థితి అగమ్యగోచరం. వైసిపిని ఓడించి పార్టీని గెలిపించామనే ఆనందం కంటే ప్రస్తుతం తెదేపాలో నెలకొన్న విచిత్ర పరిస్థితితో విపక్షం వైసీపీ వారిచే అవహేళనలు అవమానాలు తప్పడం లేదని తెలుగు తమ్ముళ్లు తలలు పట్టుకుంటున్నారు. నియోజకవర్గంలో బహుళ నాయకత్వతీరుతో కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెదేపా నుంచి సస్పెండు కావడం, పార్టీ ఇన్చార్జి, కోఆర్డినేటర్లను నియమించడంతో గ్రూపు రాజకీయాలకు కారణమవుతోంది. మరోవైపు రెండు గ్రూపుల్లో ఎవరి మాటకు ప్రాధాన్యం ఇవ్వాలో తెలియక అధికారుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది.

సత్యవేడుపై తొలినుంచి ప్రయోగాలే

కార్యకర్తలు వద్దన్నా అధిష్టానం వారి అభీష్టానికి వ్యతిరేకంగా టికెట్టు ఇవ్వడం పార్టీలో విభేదాలకు దారి తీయడం తొలినుంచి పరిపాటిగా మారింది. వైకాపా ఎమ్మెల్యేగా ఉన్న కోనేటి ఆదిమూలంకు టికెట్టు ఇస్తే ఓటమి తప్పదని కార్యకర్తలు మొత్తుకున్నా, పార్టీ అధిష్టానం వారి అభీష్టానికి వ్యతిరేకంగా టికెట్టు ఇచ్చింది. గండం గట్టెక్కి తెదేపా ఎట్టకేలకు గెలిచింది. అయితే ఎన్ని ఆరోపణలు ఎదురైనా అండగా ఉండాల్సిన అధిష్టానం ఎమ్మెల్యేపై లైంగిక ఆరోపణల నేపథ్యంలో సస్పెండు చేసింది. వివాదం సమసిపోయి ఏడాది గడుస్తున్నా సస్పెన్షన్ ఎత్తకపోగా, వరుసగా ఇన్చార్జి, కో ఆర్డినేటర్లను నియమించడం పార్టీలో విభేదాలకు, విమర్శలకు దారి తీస్తోంది.

పెత్తందారీ పెత్తనమేంటని నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే

కేవిబి పురం మండలంలోని పెరుందేశం గ్రామంలో టిడిపి ప్రవేశపెట్టిన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ తాను వైకాపాలో పెత్తందారీ పెత్తనాన్ని ఎదిరించి బయటకు వస్తే, ఇక్కడ కూడా అదే పరిస్థితి నెలకొనడంపై ఆయన మండిపడ్డారు. తాను రాజ్యాంగం ప్రకారం ప్రజల ఓట్లతో గెలిచి అధికారికంగా ఎమ్మెల్యేగా ఉండగా మళ్లీ అగ్రవర్ణాల పెత్తందారీ పెత్తనమేంటని నిప్పులు చెరిగారు. పార్టీ పదవులలో ఉన్న వారికి అధికారులు, పోలీసులు వారికి సెల్యూట్ చేయడమేంటని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను ఓడించాడానికి కుట్రచేసిన వారితో తిరుగుతారా అంటూ నిప్పులు చెరిగారు ఒకరు పరిశీలకుడు, ఒకరు ఇన్చార్జి, కోఆర్డినేటరు అంటూ ఎంతమంది పెత్తనం చేస్తారంటూ ప్రజావేదికలో ప్రశ్నించడం చర్చాంశనీయమైంది.

విబేదాలను పరిష్కరించకపోతే నష్టం తప్పదు

ఎమ్మెల్యే సస్పెన్షన్ అనంతరం ఎన్నికల పరిశీలకుడు, ఇన్చార్జిగా నియమించిన చంద్రశేఖర్ నాయుడు, శ్రీపతి బాబు ఇక్కడ టీడీపీ ఓటమికి పనిచేసిన చెరకు రసం బ్యాచ్ తోను, ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పనిచేసిన వారితోను, మట్టిమాఫియాతోనూ తిరగడం, అధికారిక వ్యవహారాల్లో పెత్తనం చేయడం టీడీపీ కార్యకర్తలు అభిమానుల్ని కాకుండా, పార్టీలో అందరినీ విస్మయానికి గురిచేసింది. తాజాగా వారిపై గల ఆరోపణలతో వారిని తప్పించి ఎమ్మెల్యేకు అనుకూలంగా పార్టీ ప్రోగ్రాం కోఆర్డినేటర్గా కూరపాటి శంకర్రెడ్డిని నియమించారు. అయితే ఇరువురూ కలిసి సమన్వయంతో పార్టీని నడిపించాల్సి ఉండగా, తనను ఓడించడానికి యత్నించిన వారితో కలిసి కోఆర్డిరేటర్ పర్యటించడంపై ఎమ్మెల్యే అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు. కో ఆర్డినేటర్ గా గ్రూపు రాజకీయాలకు తావు లేకుండా పార్టీలో అందరినీ కలుపుకుని పోవాలసి ఉండగా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతోంది. దీంతో పార్టీలో మరోమారు వర్గవిబేదాలకు దారి తీస్తోంది. ఇకనైనా అధిష్టానం చొరవ తీసుకుని పార్టీ బలోపేతానికి ఏకనాయకత్వం దిశగా చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకుంటున్నారు.

ఇలాంటి విచిత్ర పరిస్థితిలో టీడీపీ ఎమ్మెల్యే, కో ఆర్డినేటర్ అనే రెండు గ్రూపులుగా చీలి పోయింది. రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేని విధంగా ఎస్సీ రిజర్వుడు నియోజక వర్గంలో మాత్రమే ఇలా విచిత్రంగా కో ఆర్డినేటర్, ఇంచార్జి నియమించడం దళిత బడుగు వర్గాలను విస్మయానికి గురి చేస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న ఎన్నికల్లో టీడీపీపై ప్రభావం చూపడం ద్వారా పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని విశ్లేషకులు, టీడీపీ వర్గాలు అంచనా వ్యక్తం చేస్తున్నాయి అసలే ఎస్సీ ఓటు బ్యాంకు వైసీపీ కి ఉండగా.టీడీపీలో ఎస్సీల పట్ల చూపుతున్న వివక్ష కారణంగా టీడీపీ కి సానుభూతి ఓటర్లు గల ఎస్సీలు దూరమయ్యే పరిస్తితి ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

భూ ఆక్రమణను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ కేబీఆర్ నగర్‌కు వెళ్లే దారిలో చెన్నాయిగుంట గ్రామ లెక్క దాఖలా సర్వేనెంబర్ 169/1 లోని ఎ4.27 సెంట్ల గాండ్లవాని గుంట పరంబోకు భూమిలో కొంతమంది చెట్లను చదును చేసి ఆక్రమణకు ప్రయత్నించడంతో తిరుపతి అర్బన్ తాహశిల్దార్ సురేష్ బాబు ఆదేశాల మేరకు స్థానిక వీఆర్వో ప్రసాద్, సతీష్ రెవిన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. ఆక్రమణ దారులు తమకు ఈ స్థలంపై పట్టా ఉందని, అందుకే చదును చేసి ఇల్లు నిర్మించుకుంటున్నామని రెవిన్యూ సిబ్బందికి చెప్పారు. ఈ స్థలంకు సంబంధించి ఎటువంటి పట్టాలు మంజూరు చేయలేదని, ప్రభుత్వ భూమిని ఆక్రమించడానికి మళ్లీ ప్రయత్నం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆక్రమణదారులను రెవిన్యూ అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ సిద్దయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పులివర్తి నానికి మాతృవియోగం



నానిని పరామర్శిస్తున్న కందారపు మురళి సీపీఎం, బిఆర్ నాయుడు, టీటీడీ ఛైర్మన్, బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి - రామచంద్రాపురం : చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాతృ మూర్తి లక్ష్మీ భారతి వయోభారంతో శుక్రవారం వైకుంఠ ప్రాప్తి పొందారు. విషయం తెలుసుకున్న తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, ప్రభుత్వ విప్ గంగాధర్ నెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్, నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడు, టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, తుడా అధ్యక్షులు దివాకర్ రెడ్డి, టీటీడీ బోర్డు ఎక్స్ అఫిషియో సభ్యులు డాలర్ దివాకర్ రెడ్డి, పలు మండలాల అధ్యక్షులు వివిధ శ్రేణుల నాయకులు లక్ష్మీ భారతి పార్థివ దేహానికి నివాళి అర్పించారు. నానిని పరామర్శించారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి - కేవీబీపురం: కేవీబీ పురం మండలం, కల్లూరు గ్రామ సమీపంలోని, కోవనూరు రెవెన్యూ సర్వే నంబరు 262 బ్లాక్ లో సుమారు 54 ఎకరాల ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమిస్తున్నారని గ్రామస్తులు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహశీల్దార్ రోశయ్యకు ఇటీవల వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహశీల్దార్ రికార్డులను పరిశీలించి సదరు భూమిలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ కరుణాకర్ మాట్లాడుతూ ఈ భూముల్లో ఎవరైనా కబ్జాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని నీరేటి కండ్రిగ, కలకంబట్టులో పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ సూచించారు. శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆమె నీరేటికండ్రిగ కలకంబట్టులో చెత్త సేకరణ కేంద్రం వద్ద గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విద్యార్థులతో స్వచ్ఛభారత్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఎంపీఓ మనెయ్య, ఏపీఓ దేవరి, పాఠశాల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: డొక్కా సీతమ్మ మధ్యాహ్న పథకం మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఎంఈవో మునిసుబ్రమణ్యం సూచించారు. ఆయన శుక్రవారం బుచ్చినాయుడు కండ్రిగ ప్రాథమిక పాఠశాలలో ఉదయం ప్రార్థన కార్యక్రమంలో పాల్గొని అనంతరం నెల వారి క్విజ్ పెట్టి గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని రుచికరమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టేషనరీ కిట్స్ వితరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండలం, చిల్లకూరు ఉన్నత పాఠశాలకు కొనిదల ముని రామయ్య వర్ధంతిని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 20 వేల రూపాయల విలువ చేసే ఉచిత స్టేషనరీ కిట్స్ ను అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఏడాది క్రమం తప్పకుండా రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మునిగిరీష్, వారి సోదరుడు మునిహరీష్ తండ్రి పేరిట సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు దశరథరామి రెడ్డి, మల్లు విజయకుమార్ రెడ్డి, బాలకృష్ణం రాజు, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరులో శుక్రవారం ఏర్పడిన విద్యుత్ అంతరాయంతో నీటి సరఫరా ట్యాంకులు పూర్తి స్థాయిలో నిండలేదని, కావున శనివారం నీటి సరఫరా తక్కువ మోతాదులో జరుగుతుందని గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ ప్రజలు గమనించి మంచి నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

21 వరకు తపాలా సేవల్లో అంతరాయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తపాల కార్యాలయాల్లో ఐటీ 2.0 అప్లికేషన్ విడుదల సందర్భంగా ఈనెల 21వ తేదీ వరకు తపాలా సేవల్లో అంతరాయం కలుగుతుందని, ఖాతాదారులు సహకరించాలని గూడూరు ప్రధాన తపాలా కార్యాలయ సూపరిండెంట్ ఎల్.వి మురళీ కుమార్ కోరారు. స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపిటి అప్లికేషన్ అందుబాటులోకి తీసుకువస్తున్నందుకు తపాలా శాఖ గర్వంగా ఉందన్నారు. ఈ పరివర్తనాత్మక చొరవలో భాగంగా అప్ గ్రేడ్ చేసిన వ్యవస్థ ఈనెల 22వ తేదీనుండి అన్ని తపాలా కార్యాలయాల్లో అందుబాటులోకి వస్తుందని, అప్పటినుండి మెరుగైన సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, నోట్ బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి - చిల్లకూరు : మండల పరిధిలోని పోలిరెడ్డి పాలెం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సూళ్లూరుపేట లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట షార్ ఆధ్వర్యంలో 60 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, డిక్షనరీ అందించారు. అనంతరం లయన్స్ క్లబ్ సభ్యులు హేమలత మనవరాలు సంజన పుట్టినరోజు సందర్భంగా ప్లేట్లు, గ్లాసులు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏటా పేద విద్యార్థులను గుర్తించి వారికి ఉచిత విద్య పరికరాలను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా లైన్స్ క్లబ్ రీజనల్ సెక్రటరీ ఆదిశేషారెడ్డి, క్లబ్ ప్రెసిడెంట్ లలిత, సెక్రెటరీ అరుణకుమారి, లైన్స్ క్లబ్ సభ్యులు అప్పారావు, రాధాకృష్ణారావు, హేమలత, అంకులరావు, సంగీత స్కూల్ టీచర్ ప్రసన్న, రమ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి - ఏర్పేడు : అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం గోవిందవరం కండ్రిగలో ఇంటింటి ప్రచారంలో పాల్గొని సంక్షేమ పథకాలు, సమస్యలపై ఆరా తీశారు. మండలంలో ఎక్కడా కూడా తాగునీటి సమస్య తలెత్తిన అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు, రెడ్డివారి గురవారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నారాయణ వనం మండలం, దివిచ కసకపాలెం పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని శుక్రవారం నారాయణవనం మండలం ఎంపీడీవోకి వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) జిల్లా ఉపాధ్యక్షులు మహేష్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ పంచాయతీలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని ట్యాంకుల ద్వారా నీటిని సప్లై చేయాలని, వీధి పైపులైన్లు మరమ్మతులు చేయాలని కోరారు. బోర్లు గ్రామంలో మూడు ఉన్నాయని, కానీ మరమ్మతులకు నోచుకోలేదన్నారు.

వాహనం కదలదు.. చెత్త వదలదు

■ మూలన పడ్డ పారిశుద్ధ్య వాహనాలు ■ లక్షల్లో ప్రజాధనం వృథా.. ■ వినియోగంలో తేవాలి : నగరవాసులు





ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గత ప్రభుత్వంలో లక్షల రూపాయలు ఖర్చుచేసి నగరంలో ఉన్న చెత్తను యంత్రాల సహాయముతో తరలించేందుకు మూడు చక్రాల వాహనాలను కొనుగోలు చేసి 13 వాహనాలు పుత్తూరు మున్సిపాలిటీకి అప్పగించింది. ప్రస్తుతం ఇందులో మూడు వాహనాలు మాత్రమే వినియోగిస్తున్నారు. మిగిలిన వాటిని మూలన పడేశారు. వార్తాపత్రికల్లో కథనాలు వస్తే ఒక చోట నుంచి మరొక ప్రాంతానికి తరలిస్తున్నారు. తిరుపతి జిల్లా, పుత్తూరు మున్సిపాలిటీలో 27 వార్డులు ఉన్నాయి. గృహాల నుండి సేకరించిన చెత్తను ఒక ప్రదేశంలో పడేస్తారు. ఈ చెత్తను మున్సిపాలిటీ కార్మికులు గ్రేడింగ్ చేసి మూడు చక్రాల వాహనాల ద్వారా సమీపంలో ఉన్న చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రం తరలిస్తారు. అక్కడ తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువుగా మార్చే ప్రక్రియ జరుగుతుంది. కానీ ప్రస్తుతం మూడు చక్రాలు వాహనాలు మాత్రమే మున్సిపాలిటీ పరిధిలో తిరుగుతూ చెత్తను కార్మికుల సహాయం ద్వారా తరలిస్తున్నారు. మిగిలిన 10 వాహనాలను మూలన పడేశారు. అలాగే గతంలో చిన్న జెసిబి కొనుగోలు చేసి కొద్దిరోజులు ఉపయోగించి మూలన పడేశారు. అలాగే ట్రాక్టర్లు కూడా మూలనపడేసి ఉండటంతో తుప్పు పట్టి పోతున్నాయి. లక్షల రూపాయల ప్రజాధనం ఇలా మూలాన పడి దుర్వినియోగం అవుతోందని నగర ప్రజలు ఆరోపించారు. ఇప్పటికైనా మున్సిపల్ శాఖ అధికారులు స్పందించి మూలన పడిన వాహనాలను వినియోగంలోకి తీసుకొని రావాలని కోరుతున్నారు.

వాహనాలు వినియోగంలోకి తీసుకొని రావాలి.. నాగరాజు, 14వ వార్డు

పట్టణంలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు మరమ్మతుకు గురయ్యాయని మూలన పడేస్తున్నారు. ప్రజా ధనం వృథా అవుతోంది. చెత్త సేకరణ సరిగా జరగడం లేదు.

బ్యాటరీ వాహనాలు వాడాలి.. వెంకటేష్, నందిమంగళం, 11వ వార్డు

వాహనాలు మరమ్మతుకు గురై ఉంటే వెంటనే వాటికి మరమ్మతులు చేపట్టాలి. పట్టణంలో పారిశుధ్య అవసరాల కోసం వినియోగించాల్సి వాహనాలను మూలన పడేయటం సరికాదు. అధికారులు దృష్టి సారించాలి.

13 వాహనాలు వచ్చాయి అందులో మూడు వాహనాలు ప్రస్తుతం తిరుగుతున్నాయి. పది వాహనాలు మరమ్మతుకు టెండర్లు పిలిచాం. కానీ ఎవరు ముందుకు రాలేదు. మరొకసారి టెండర్లు పిలుస్తాం వచ్చిన వెంటనే మరమ్మత్తు చేస్తాం.

మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ

మండల పరిషత్ కార్యాలయంలో మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - వాకాడు: ప్రభుత్వ ఆదేశాలు అనుసరించి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మెడికల్ డిపార్ట్మెంట్ వారు క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా 30 సంవత్సరాలు పైబడిన ప్రభుత్వ ఉద్యోగులు తప్పనిసరిగా ప్రైమరీ హెల్త్ చెకప్ తప్పనిసరిగా చేసు కోవాలని వైద్యాధికారులు తెలియజేశారు. పర్యావరణ మార్పులను అనుసరించి జీవన విధానాన్ని ఎలా అలవర్చుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు, మండల తహశీల్దార్ ఎస్.రామయ్య, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన కల్పించండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, మండల పరిషత్ అభివృద్ధి కేంద్రంలో శుక్రవారం వైద్యాధికారులు సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర్ మురళీధర రెడ్డిల ఆదేశాల మేరకు నిర్వహించినట్లు ఆరోగ్యాధికారి డిఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు బాల్య వివాహాలతో వచ్చే అనర్థాలను గ్రామాల్లో ప్రచారం చేయాలని సూచించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు రెవెన్యూ, ఆరోగ్య, పంచాయతీ రాజ్, శిశు సంక్షేమ శాఖలు, సచివాలయంలోని మహిళ పోలీస్ సిబ్బంది, స్థానిక నాయకులతో కలసి గ్రామాలలో ప్రతి సచివాలయాలలో యుక్తవయసు బాలబాలికలకు, బాల్య వివాహముల వలన జరిగే నష్టాలు, చట్టాలు గురించి తెలియ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఎమ్మార్వో శ్రీదేవి, ఎస్ఐ విశ్వనాథ నాయుడు, ఏవో షణ్ముగం, ఇంజనీరింగ్ సచివాలయ సెక్రటరీ, సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

5వ స్టేట్ గ్రాప్లింగ్ రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ కైవసం



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని గిరిజన భవన్‌లో 12/17/2025 నుండి 13/07/2025 వరకు నిర్వహించిన కుస్తీ పోటీల్లో శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినిలు ఉత్తమ ప్రతిభ కనబరిచి పలు పతకాలను కైవసం చేసుకొని, బంగారు పతకాలు సాధించిన విద్యార్థినిలంతా జాతీయస్థాయికి ఎంపికయ్యారు. పథకాలను సాధించిన 17 మంది విద్యార్థిలను కళాశాల ప్రిన్సిపల్ డా.సి.భువనేశ్వరి అభినందించి ఇదే స్ఫూర్తి మరెన్నో క్రీడల్లో కూడా రాణించాలని ప్రోత్సహించారు. వీరికి శిక్షణ ఇచ్చిన కోచ్ సాయిసుమతిని క్రీడల్లో కళాశాలకు మరెన్నో పతకాలను తీసుకురావాలని తెలిపారు. అభినందన కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థినిలు పాల్గొన్నారు. పతకాలను సాధించిన విద్యార్థినిలు ఎస్ అమృత - సీనియర్ సిఈసి బంగారు, వెండి పతకాలు, ఈ. సౌమ్య - సీనియర్ సిఈసి 2 బంగారు పతకాలు, కె. రెడ్డి జీవన- సీనియర్ హెచ్ఈసి బంగారు పతకం, ఎన్. చంద్రకళ - సీనియర్ ఎమ్ఈసి- బంగారు పతకం, ఎమ్. భావన- సీనియర్ ఎమ్ ఈసి- బంగారు, ఎస్.వైష్ణవి - సీనియర్ సిఈసి- బంగారు పతకం, కె. శశిరేఖ సీనియర్ సిఈసి- బంగారు పతకం, ఎస్. పూజ సీనియర్ హెచ్ ఈ సి- బంగారు పతకం, ఆర్. దీపిక- సీనియర్ సి ఈ సి - బంగారు పతకం, ధాత్రి మొగధారమ్మ- సీనియర్ హెచ్ఈసి- రజత పతకం, డి.నేహశ్రీ సీనియర్ బైపిసి రజత పతకం, ఎన్. పూజ - జూనియర్ బైపిసి - రజత పతకం, వై. స్వాతిలక్ష్మి- జూనియర్ ఎమ్ పిసి- రజత పతకం, డి చైతన్య శ్రీ- సీనియర్ సి ఈ సి - రజత పతకం, లక్ష్మిలావణ్య- సీనియర్ సిఈసి- రజత పతకం, దీపిక- సీనియర్ సిఈసి - కాంస్య పతకం, ఎన్. పూజ శ్రీ - సీనియర్ బై పిసి - కాంస్య పతకం సాధించారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరులో రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపు మేరకు ఏ.పీ.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ కార్మికులు తమ సమస్యలు పరిష్కారానికి చేస్తున్న సమ్మె శుక్రవారానికి అరవ రోజుకు చేరుకుంది. పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సమ్మె మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుద్ధ్య కార్మికులు, సిఐటియు నాయకులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం చేసేంతవరకు పోరాటాన్ని ఆపేది లేదని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ధారా కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్, సి.ఐ.టి.యు గూడూరు పట్టణ ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


భవిష్యత్ ఆశాకిరణం ఎర్రజెండాయే

పేరుకే డబల్ ఇంజన్ అంతా డబుల్ అప్పులే :సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: దేశ భవిష్యత్‌కు ఆశాకిరణం ఎర్రజెండాయే అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ స్పష్టం చేశారు. రానున్న కాలంలో వామపక్ష, ప్రజాతంత్ర శక్తులంతా ఏకమై బిజెపిని నిలువరిస్తాయని చెప్పారు. తిరుపతి నగరంలో శుక్రవారం సిపిఐ నగర 14 వ మహాసభలు ఘనంగా నిర్వహించారు. బహిరంగ సభకు ముందుగా కాటన్ మిల్లు నుండి కృష్ణారెడ్డి కాలనీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచికగా పార్టీ జెండాను రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఆవిష్కరించారు. సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ లౌకిక వాదానికి వ్యతిరేకంగా, రాజ్యాంగానికి వ్యతిరేకంగా బిజెపి మతోన్మాదపు చర్యలకు ఒడిగడుతోందని మండిపడ్డారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ తిరుపతి నగర ఖ్యాతి, అభివృద్ధిలో, విస్తరణలో కమ్యూనిస్టుల పాత్రే కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, కత్తి రవి, నదియా, నగర కార్యవర్గ సభ్యులు ఎన్ డి రవి, శివ, కే వై రాజా, రామకృష్ణ, పద్మనాభ రెడ్డి డాక్టర్ ప్రసాద్, డాక్టర్ బలరాం, చలపతి, ఉదయ్, మంజుల, రత్నమ్మ, ఏ ఐ టి యు సి జిల్లా అధ్యక్షులు చంద్ర శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

రైతుల సమస్యలు పరిష్కరించాలి



సింగల్ విండో చైర్మన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పదవులు తీసుకోవడం కాదు, సొసైటీకి వచ్చే రైతుల సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ సూచించారు. శుక్రవారం పుత్తూరు రూరల్ మండలం, తడుకు పంచాయతీ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, పరమేశ్వర మంగళం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించారు. తడుకు పంచాయతీ చైర్మన్ కరుణ యాదవ్, డైరెక్టర్లు విజయభాస్కర్ రెడ్డి, విజయ్, పరమేశ్వర మంగళం పంచాయితీ పరిధిలో సహకార సంఘం చైర్మన్ ఎస్ మోహన్ రాజు, డైరెక్టర్లు సుధాకర్ నాయుడు, జాన్ భాస్కర్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధ్యతలు తీసుకున్నవారు రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బాలాజీ, ప్రధాన కార్యదర్శి హేమంత్ కుమార్, తడుకు సర్పంచ్ బొబ్బిలి వెంకటేష్ యాదవ్, పరమేశ్వర మండలం సింగల్ విండో మాజీ అధ్యక్షులు హిందూమతి తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ తోనే మహిళాభివృద్ధి : మట్టం శ్రావణి రెడ్డి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాష్ట్ర, పార్లమెంట్ తెలుగు మహిళలతో మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర తెలుగు మహిళా అధ్యక్షురాలు, హోమ్ మినిస్టర్ వంగలపూడి అనితని తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రావణి రెడ్డి మాట్లాడుతూ మహిళలందరూ గత 5సంవత్సరాల చాలా కష్టపడి పని చేశారన్నారని హోం మంత్రి అన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజల్లోకి తీసుకుని వెళ్ళి, వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పి కొట్టాలని మంత్రి సూచించారన్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పై వైసీపీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలపై పోరాటం చేయాలని మంత్రి తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి, ఉపాధ్యక్షురాలు దువ్వూరు భారతి పాల్గొన్నారు.

శ్రీరామలో విద్యార్థినులకు అవగాహన సదస్సు



ముఖ్యఅతిథి అనంత్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ జయచంద్ర

ప్రజాశక్తి - తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాలకు చెందిన ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, తిరుపతికి చెందిన ఫెమి9 వారి సంయుక్త ఆధ్వర్యంలో హార్మోన్ల మార్పు, ఆరోగ్యకరమైన జీవనశైలి అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఫెమి9 కు చెందిన ఆర్. అనంత్ మాట్లాడుతూ విద్యార్థినులు విద్యతో పాటుగా ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని, సుచియైన ఆహారం, రోజువారి వ్యాయామాలు చేయడంతో హార్మోన్ల సమతుల్యంగా ఉంటుందని, ఈ దిశగా విద్యార్థినిలు తమ జీవనశైలి మార్పు చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జయచంద్ర మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యతో పాటుగా విద్యార్థులకు ఉపయుక్తమైన కార్యక్రమాలను వ్యాయామం, యోగ వంటివి తరచూ నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్, కళాశాల జాయింట్ సెక్రటరీ మన్నెం అరవింద కుమార్ రెడ్డి, ఉమెన్ ఎంపవర్మెంట్ కన్వీనర్ జి.చంద్రకళ, మహిళా సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్‌కు ప్రత్యేక అధికారులు

ప్రజాశక్తి - నాయుడుపేట, నాయుడుపేట రూరల్: నాయుడుపేట మండలంలోని 19 పంచాయతీలకు సంబంధించిన 11 సచివాలయాలకు స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులను నియమించినట్లు నాయుడుపేట ఎంపీడీవో సురేష్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. మేనకూరు సచివాలయం ప్రత్యేక అధికారిగా ఎం పి డి ఓ కె సురేష్ బాబు, పూదూరు-తహసీల్దార్ ఎం. రాజేంద్ర, విన్నమాల-సి డి పి ఓ ఉమా మహేశ్వరీ, జువ్వలపాలెం-ఏ ఓ (ఎం పి పి)ఎ. సుబ్బారావు, భీమవరం-హౌసింగ్ ఎ ఈ శ్రీనివాసరావు, కాపులూరు ఆర్ డబ్ల్యూ ఎస్ ఎ ఈ జి.రంగస్వామి, పూడేరు-వ్యవసాయశాఖఅధికారి జి. గణేష్, గొట్టిప్రోలు-ఇరిగేషన్ ఎ ఈ ఈ బి. శ్రీనివాసరావు, అన్నమేడు ఎ పి ఓ ఎం. బాను ప్రియ, కల్లిపేడు-ఎ పి ఎం బి. ఉమాదేవి, కూచివాడ సచివాలయం ప్రత్యేక అధికారిగా ఐ సి డి ఎస్ సూపర్ వైజర్ కె. మణెమ్మ లను నియమించినట్లు ఎం.పి.డి.ఓ తెలిపారు. సచివాలయ ప్రత్యేక అధికారులు ఆయా పంచాయతీల్లో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ సక్రమంగా అమలు అయ్యేందుకు కృషి చేయాలని సూచించారు.

మంచినీళ్ల గుంట పరిశీలన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : మంచినీళ్ల గుంట కలుషితమైందని, దాన్ని పరిష్కరించాలని కార్పొరేటర్ నరసింహాచారి టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి దష్టికి తీసుకువచ్చారు. శుక్రవారం ఆయన మంచినీటి గుంట ను పరిశీలించారు. కలుషితమైన నీటి సమస్యపై భాను ప్రకాష్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఎన్నో ఏళ్లుగా రుయా, స్విమ్స్ ఆసుపత్రిలో ఉన్న సెప్టిక్ ట్యాంకులు లీకై అందులోకి కలుషిత నీరు భూమి పొరల్లో నుంచి మంచినీళ్ల గుంట లోకి చేరుతోందని, అందువలన మంచినీళ్లు కుంట నీరు కలుషితమయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వేషన పోరాట సమితి నాయకులు డిఎంసి భాస్కర్, డిప్యూటీ మేయర్ ఆర్‌సి మునికృష్ణ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): శేషాచలం అటవీ పరిధి కడప జిల్లా సానిపాయ సమీపంలోని వీరబల్లి అటవీ ప్రాంతంలో ఒక ఎర్రచందనం స్మగ్లర్‌ను అరెస్టు చేసి మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఎస్ఐ నరేష్ బృందం స్థానిక ఎఫ్బి ఓ అనిల్ కుమార్ తో కలిసి వీరబల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలో కూంబింగ్ చేపట్టారన్నారు. అయ్యలవారి పల్లి ఒక వ్యక్తి మోటార్ సైకిల్ తో పాటు నిల్చుని ఉన్నారని, అతని దగ్గరకు వెళ్తుండడంతో వాహనాన్ని విడిచిపెట్టి పారిపోయే ప్రయత్నం చేశాడన్నారు. పారిపోతున్న వ్యక్తిని పట్టుకొని చుట్టుపక్కల పరిశీలించగా మూడు ఎర్రచందనం దుంగలు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడ్డ వ్యక్తి తిరుపతి జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. ఈ ఘటనపై తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్లో సిఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

6 కేజీల గంజాయి స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : గంజాయి రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుంచి 6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి ఈస్ట్ పోలీసులు తెలిపారు. పోలీసులు కథనం మేరకు గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు అందిన సమాచారం మేరకు తిరుపతి చింతల సేన రైల్వే గేటు వద్ద నిఘా ఉంచారు. ప్రకాశం జిల్లా, పామూరు మండలానికి చెందిన కదంబూరు రమేష్ గంజాయి అక్రమంగా తరలిస్తూ పోలీసులుకు చిక్కారన్నారు. గంజాయి సరఫరాలో ఒరిస్సా రాష్ట్రానికి చెందిన గోపాల్, చెన్నైకి చెందిన అభి అనే వ్యక్తులు ప్రధాన పాత్ర దారులుగా విచారణలో తేలిందన్నారు. పట్టుపడ్డ ముద్దాయిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని, ప్రధాన నిందితుల కోసం గాలింపు చేపట్టామని తెలిపారు.

క్షణికావేశంలో తల్లిని చంపిన కొడుకు



మృతురాలు శారద

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : క్షణకావేశంలో జన్మనిచ్చిన తల్లినే కన్న కొడుకు హత్య చేసిన విషాదకర ఘటన తిరుపతిలో శుక్రవారం చోటు చేసుకుంది. అలిపిరి పోలీసుల కథనం మేరకు ...చిత్తూరు జిల్లా, రొంపిచర్ల మండలం, మోటమల్లెల పంచాయతీ, నగరి గ్రామానికి చెందిన శారద(37)కు తిరుపతి జిల్లా, చిన్నగొట్టిగల్లు మండలం, కోటబైలు పంచాయతీ, నల్లఓబులవారిపల్లి గ్రామానికి చెందిన సురేష్ తో వివాహం అయింది. కుటుంబ పోషణ కోసం సురేష్ కువైట్ లో ఉండగా , శారద తన ఇద్దరు కుమారులతో కలిసి గొల్లవానికుంటలో నివాసం ఉంటుంది. శారద రేణిగుంట రోడ్డు లోని మారుతి షోరూంలో సేల్స్ గర్ల్‌గా విధులు నిర్వహిస్తోంది. మరో వ్యక్తితో అక్రమ సంబంధం ఉందని తెలుసుకొని, జీర్ణించుకోలేని కుమారుడు తల్లిని నిలదీశాడు. క్షణకావేశంలో తల్లి పై కొడుకు పిడిగుద్దులతో దాడి చేసి, ఆపై గొంతు నులిమి హత్య చేశాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అలిపిరి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వాతావరణ మార్పులతో అప్రమత్తం

ప్రజాశక్తి - రేణిగుంట: వాతావరణంలో మార్పు వచ్చింది అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ అధికారి వెంకటయ్య, హెల్త్ సూపర్వైజర్లు శివశంకర్, కామరాజు తెలియజేశారు. శుక్రవారం ఆర్. మల్లవరం గ్రామంలోని జడ్పీ. హైస్కూల్ నందు డెంగీ మాసో త్సవాలు సందర్భంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం ఉందన్నారు.

విద్యార్థులకు ఉచిత ఆటో సౌకర్యం



ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) చంద్రగిరి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొటాలకు 5 కి.మీ దూరంలో ఉన్న నాగయ్య గారిపల్లి, రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి నుండి పాఠశాలకు వచ్చు విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం పెంచుటకై ప్రధానోపాధ్యాయులు కేశవయ్య, ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థి హేమ శేఖర్ సహకారంతో నెలకు రు. 7,000/- సొంత నగదుతో విద్యార్థులకు ఆటో సౌకర్యం కల్పించడం జరిగింది.

అంతరాయం లేని విద్యుత్ సరఫరానే లక్ష్యం

- పిఎమ్ సూర్యఘర్ పథకంపై విస్తృత అవగాహన
- సమీక్షా సమావేశంలో సిఎండి కె. సంతోష రావు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేయాలనే లక్ష్యంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు కోరారు. తిరుపతిలోని ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం సంస్థ అధికారులతో సిఎండి కె. సంతోష రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది హెడ్ క్వార్టర్స్‌లోనే నివాసం వుంటూ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలన్నారు. సంస్థ పరిధిలో ఈ యేడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఫీడర్ ట్రిప్పింగ్స్ గరిష్ఠంగా అనంతపురం సర్కిల్లోనూ, అలాగే కనిష్ఠంగా కర్నూలు సర్కిల్లోనూ నమోదైనట్లు తెలిపారు. ఫీడర్ ట్రిప్పింగ్స్ పై సంబంధిత అధికారులు నిరంతరం సమీక్షిస్తూ, వాటిని పూర్తిస్థాయిలో నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సంస్థ పరిధిలో పిఎం సూర్యఘర్ పథకంపై వినియోగదారుల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం వుందన్నారు. పిఎం సూర్యఘర్ పథకం ద్వారా చేకూరే ప్రయోజనాలను వినియోగదారులకు సమగ్రంగా వివరించి సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. అదేవిధంగా రైతులకు



వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల పొలాల్లో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను గుర్తించినట్లయితే వాటిని వెంటనే మార్చాలని, లూజ్ లైన్లను సరిచేయాలని సూచించారు. సంస్థలో సబ్ స్టేషన్లు, లైన్ల నిర్వహణా పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని కోరారు. లైన్ లాసెస్‌ను తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ వున్న వర్క్ ఆర్డర్స్‌ను వెంటనే క్లోజ్ చేయాలని, వర్క్ ఆర్డర్స్ క్లోజ్ చేయని అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంస్థ పరిధిలో ట్రాన్స్ఫార్మర్ ఫెయిల్యూర్స్‌ను తగ్గించేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా ట్రాన్స్ ఫార్మర్లు మరమ్మతుకు గురైతే వెంటనే మార్చాలని ఆదేశించారు. ట్రాన్స్ ఫార్మర్ ఫెయిల్యూర్స్ ఎక్కువగా వున్నట్లయితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా సంస్థ పరిధిలో సుదీర్ఘ కాలంగా పెండింగ్ వున్న విద్యుత్ బకాయిలను వసూలు చేయడం ద్వారా సంస్థ మనుగడకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయాలు, సమస్యలపై టోల్ ఫ్రీ నంబరు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం, చాట్బోట్, 91333 31912 నంబరుతో వాట్సాప్ చాట్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటిని త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్/టెక్నికల్, హెచ్ఆర్డి కె. గురవయ్య, డైరెక్టర్/ప్రాజెక్ట్స్ పి. అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, డిఎస్ వరకుమార్, కె.ఆర్. ఎస్. ధర్మజ్ఞాని, పి. హెచ్. జానకిరామ్, కె. ఆదిశేషయ్య, ఎన్. శోభావాలెంటీనా, కె. రామమోహన్ రావు, పి. మురళి, జనరల్ మేనేజర్లు కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, సురేంద్ర రావు, మురళి, శ్రీకాంత్, చక్రపాణి, నరేంద్రనాథ్, రమేష్, సూపరింటెండింగ్ ఇంజనీర్లు విజయన్, రమణ, ఉమాపతి, సంపత్ కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్, శేషాద్రి శేఖర్, ఇస్మాయిల్ తోపాటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు తదితరులు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా బెంట్లీ సిస్టమ్స్ ఇన్నోవేషన్ డే



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: మౌలిక సదుపాయాల ఇంజనీరింగ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ బెంట్లీ సిస్టమ్స్, ఇన్కార్పొరేటెడ్ (నాస్‌డాక్: బి ఎస్ వై) ఇన్నోవేషన్ డే ను శుక్రవారం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమం, ప్రభుత్వ సంస్థలు, ఇంజనీరింగ్ సంస్థలు , మౌలిక సదుపాయాల కన్సల్టెన్సీల నుండి సీనియర్ నాయకులను ఒకచోట చేర్చడంతో పాటుగా డిజిటల్ ట్విన్స్, ఓపెన్, ఇంటిగ్రేటెడ్ డిజిటల్ డెలివరీ వంటివి భారతదేశం మౌలిక సదుపాయాలను రూపొందించే, నిర్మించే, నిర్వహించే విధానాన్ని ఎలా మారుస్తున్నాయో అన్వేషించే అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో బెంట్లీ సిస్టమ్స్ దక్షిణాసియా ప్రాంతీయ కార్యనిర్వాహకుడు కమలకన్నన్ తిరువాడి మాట్లాడుతూ "ఇన్నోవేషన్ డే అనేది కేవలం ఒక కార్యక్రమం కాదు. ఇది మౌలిక సదుపాయాల భవిష్యత్తును రూపొందించే నాయకులను ఒకచోట చేర్చే వేదిక అన్నారు. డిజిటల్ డెలివరీలో భారతదేశం తన ఆశయాన్ని వ్యాప్తి చేస్తున్నప్పుడు, మౌలిక సదుపాయాలను మరింత తెలివైన, పరస్పరం అనుసంధానించబడిన, స్థిరంగా మార్చే సాంకేతికతల ద్వారా మద్దతు ఇవ్వడం పట్ల బెంట్లీ గర్వంగా ఉందన్నారు. బెంట్లీలో సొల్యూషన్ ఆర్కిటెక్ట్ అభిషేక్ సిన్హా, డిజైన్ నుండి కార్యకలాపాల వరకు ఆధునిక మౌలిక సదుపాయాల సవాళ్లను బెంట్లీ ఎలా పరిష్కరిస్తుందో వివరిస్తూ కీలకోపన్యాసం చేశారు. అనంతరం పలు అంశాలపై సెషన్‌లు జరిగాయి. ఈ కార్యక్రమంలో పలు సంస్థలు ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సైరేంద్రి ధేహరికి యోగాసన ఛాంపియన్ షిప్ పోటీలలో పురస్కారం



ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాల యంలోని యోగా విజ్ఞాన విభాగం నుండి ఎంఎస్సీ యోగా థెరపీ విద్యార్థిని సైరేంద్రి ధేహరి ఒడిశాలో జరిగిన జిల్లా స్థాయి యోగాసన ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకాన్ని గెలుచుకుంది. రాష్ట్రస్థాయి యోగాసన పోటీలో 4వ బహుమతిని పొందడం ద్వారా ఆమె యోగాసన విషయంలో తన నైపుణ్యాన్ని మరింత ప్రదర్శించింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి సైరేంద్రి ధేహరి అత్యుత్తమ ప్రదర్శనకు అభినందనలు తెలియజేసి సత్కరించారు. యోగ విజ్ఞానవిభాగ ఆధ్వర్యంలో మరిన్ని బహుమతులు విశ్వవిద్యాల యానికి తీసుకురావాలని, యోగశాస్త్రంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా తెలిపారు. విశ్వవిద్యాలయ అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా మాట్లాడుతూ ప్రథమ పురస్కారం సాధిం చడం సంస్థకు ఎంతో గర్వకారణ మని అభినందించారు. ఈ కార్యక్రమంలో యోగవిజ్ఞాన విభాగాధిపతి డా.తపన్ కుమార్ ఘడయ్, యోగా విజ్ఞాన విభాగం అధ్యాపకులు, విభిన్న విభాగాల అధ్యాపకులు విద్యార్థినికి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ వైద్యశాలలో ట్రినిటీ హాస్పిటల్ చైర్మన్ అన్నదానం



ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేటలో ఎంతో పేరు ప్రఖ్యాతలు కలిగిన ట్రినిటీ హాస్పిటల్ చైర్మన్ నాగూరయ్యా గురువారం ప్రభుత్వ వైద్యశాలలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకరాలు కృష్ణవేణి వైద్యశాలకు వచ్చే పేదవాళ్ల కోసం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగస్వామ్యమవడం ఆనందంగా ఉందన్నారు. కృష్ణవేణిని మనస్ఫూర్తిగా అభినందించారు. కృష్ణవేణి మాట్లాడుతూ ఇది 186వ అన్నదాన కార్యక్రమని తెలిపారు.

హాస్టల్ విద్యార్థులను బయటకు నెట్టొద్దు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి జిల్లాలోని ప్రభుత్వ బీసీ హాస్టల్‌లో ఎఫ్ఆర్ఎస్ పేరుతో కళాశాలకు ఆలస్యం ప్రారంభం అవ్వడం వల్ల విద్యార్థులు ఆలస్యంగా హాస్టల్‌కు వచ్చినప్పుడు మీ పేరు లేదు, ఎఫ్ఆర్ఎస్ ద్వారా పరిమితంగా సీట్లు ఉన్నాయని మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను హాస్టల్ బయటకు పంపడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి అక్బర్, రవి ఆరోపించారు. ఈ విషయమై వారు బీసీ వెల్ఫేర్ జిల్లా కార్యదర్శి భరత్ కుమార్‌ని శుక్రవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. హాస్టల్ సమస్యలపై ప్రత్యేక డ్రైవ్ పెట్టి కనీస సౌకర్యాలు లేని హాస్టల్స్‌లో సౌకర్యాలు కల్పించాలని కోరారు. జిల్లా వెల్ఫేర్ అధికారి స్పందించి హాస్టల్ సమస్యలపై రోజువారీగా రివ్యూ చేస్తున్నామని, ఎఫ్ఆర్ఎస్ వల్ల కలిగే సమస్యలను రాష్ట్ర వెల్ఫేర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వినోద్, నగర కార్యదర్శి తేజ, జిల్లా నాయకులు శివ, రెడ్డి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భరతనాట్యంలో ధన్విత ప్రతిభ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : భరతనాట్యంలో స్థానిక ఎంజీఎం పాఠశాలకు చెందిన రెండో తరగతి విద్యార్థిని ఏ.హను శ్రీధన్విత ప్రతిభ చాటింది. నెల్లూరులో జరిగిన శ్రీకృష్ణ కల్చరల్ అండ్ ఈవెంట్ కార్యక్రమంలో ధన్విత తన భరత నాట్యం ద్వారా అద్భుతమైన ప్రదర్శన చేసి ప్రతిభా పురస్కారం అందుకుంది. ఈ సందర్భంగా స్థానిక పాఠశాలలో ఎంజీఎం డైరెక్టర్ గుడ్లూరు మయూర్ విద్యార్థినిని శుక్రవారం అభినందించారు.

ఎస్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేయండి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : యానాదుల అభ్యున్నతి కోసం ఎస్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబుకు శ్రీకాళహస్తి టిడిపి నేత, రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యుడు మాసారపు సుబ్బయ్య విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన మంత్రి లోకేష్ ను ఉండవల్లిలో మర్యాద పూర్వకంగా కలిశారు. ముక్కంటి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం యానాదుల సమస్యలపై చర్చించారు.

జిల్లా సీనియర్స్ జట్టు అద్భుతంగా రాణించింది



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఏసీఏ జోన్ సీనియర్ మల్టీప్లె డే మ్యాచ్‌లలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సీనియర్ జట్టు అద్భుతంగా రాణించిందని ఇదే స్ఫూర్తితో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చోటు దక్కించుకునేందుకు కృషి చేయాలని చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ విజయ్ కుమార్(క్రికెట్ విజయ్)తెలిపారు. జూన్ 28 నుంచి జూలై 12వ తేదీ వరకు అనంతపురం ఆర్డిటి స్టేడియంలో జరిగిన జోన్ డే మ్యాచ్‌లలో జిల్లా సీనియర్ జట్టు కడప, కర్నూలు, అనంతపురం జట్టుపై విజయం సాధించి ఛాంపియన్స్ గా నిలిచిన సందర్భంగా శుక్రవారం ఓ ప్రైవేట్ హోటల్లో చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించి మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా క్రికెట్ విజయ్ మాట్లాడుతూ తిరుపతిలో వార్డు స్థాయి నుంచి క్రికెట్‌ను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి వార్డులో ఐదు మందిని ఎంపిక చేసి వార్డుల వారీగా టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిసిఏ కార్యదర్శి రవి, కోశాధికారి గిరి ప్రకాష్, ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి, శ్రీధర్, జాయింట్ సెక్రటరీ సతీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులలో విద్యా సామర్థ్యాలను పెంపొందించాలి



ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) విద్యార్థులలో విద్యా సామర్థ్యాలను పెంపొందించాలని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ సూచించారు. చంద్రగిరి మండలంలోని తొండవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు.10వ తరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. వారికి పరీక్షలకు ఏ విధంగా తర్ఫీదు కావాలో అవగాహన కలిగించారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద పంపిణీ చేస్తున్న కోడిగుడ్లను పరిశీలించారు. ఉత్తమ ఫలితాలు పొందడానికి సరైన ప్రణాళికలను సిద్ధం చేసుకొని బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాస్కరయ్య, ఉపాధ్యాయులు, ఓంప్రకాష్ , పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసగాడు.. పవన్ మోతగాడు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆరు హామీలు..నూట నలభై మూడు వాగ్దానాలతో చంద్రబాబు ప్రజలను మోసం చేశారని వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి విమర్శించారు. తప్పులు జరుగుతున్నా.. హామీలు అమలు కాకున్నా జనసేనాని పవన్ ప్రశ్నించలేక బాబుకు మోతగాడిలా తయారయ్యారని ఎద్దేవా చేశారు. స్థానిక సరస్వతి ఆడిటోరియంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భూమన కూటమి తీరుపై మండిపడ్డారు. ఏడాది పాలనలో బాబు పవన్ మోసాలను ప్రజా క్షేత్రంలో ఎండగట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా చంద్రబాబు 90 వేల కోట్ల రూపాయలు ప్రజలకు బాకీ పడ్డారని అన్నారు.జగన్ మేలును, బాబు మోసాలను కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వివరించాలని సూచించారు.జనసేన కార్యకర్త రాయుడు హత్యపై డిప్యూటీ సీఎం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తన వెనుక కుట్ర జరుగుతుందనీ, ఓ వ్యక్తి ప్రమేయం ఉందని వినుత పవన్ కళ్యాణ్ కు విన్నవించినా ఎందుకు మిన్నకుండిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయుడు చెల్లి ప్రశ్నలకు పవన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, అంజూరు శ్రీనివాసులు, గిరిధర్ రెడ్డి, ఉన్నం వాసుదేవ నాయుడు, వయ్యాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారాభివృద్ధికి చక్కటి వేదిక బిఎన్ఐ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చిన్న వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడానికి, జాతీయంగా, అంతర్జాతీయంగా పరిచయం చేసుకోవడానికి బిజినెస్ నెట్వర్కింగ్ ఇంటర్నేషనల్ (బిఎన్ఐ) చక్కటి వేదికగా ఉపయోగపడుతుందని బిఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్, బి ఎన్ ఐ కాంక్లేవ్ 2.0 చైర్మన్ సందీప్ అన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బిజినెస్ నెట్వర్క్ ఇంటర్నేషనల్ ద్వారా చిన్న వ్యాపారాన్ని లాభసాటిగా నడిపించుకోవడానికి, అభివృద్ధి చేసుకోవడానికి తిరుపతి-కరకంబాడి మార్గంలోని ఆశా కన్వెన్షన్ సెంటర్ వేదికగా బి ఎన్ ఐ కాంక్లేవ్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా దాదాపు 1500 మంది ఎంట్రప్రెన్యూయర్స్ హాజరవుతున్నారన్నారు. బిఎన్ఐ ప్రపంచంలోని 64 దేశాలలో విస్తరించి ఉందని, మనదేశంలో 131 నగరాలలో రెఫరల్ బిజినెస్ వేదికగా వ్యవహరిస్తుందన్నారు. ఈ 2.0 కాంక్లేవ్ కు వచ్చే వివిధ వ్యాపార సంస్థలకు చెందిన వారు ప్రవేశ రిజిస్ట్రేషన్ కోసం రూ.1500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఎన్ఐ తిరుపతి కో చైర్మన్ టెంకాయల దుర్గాప్రసాద్, వంశీకృష్ణ, స్వాతి పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శిగా షేక్ అబ్దుల్



ప్రజాశక్తి - వరదయ్యపాలెం : వైఎస్ఆర్సిపి రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శిగా వరదయ్యపాలెం గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ ని నియామకం చేస్తూ కేంద్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా షేక్ అబ్దుల్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయిలో మైనారిటీ కార్యదర్శిగా అవకాశం కల్పించిన జగన్మోహన్ రెడ్డికి, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మౌలిక వసతులు మెరుగుపరుస్తాం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులు మెరుగుపరుస్తామని టిడిపి పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు తెలిపారు. పట్టణంలోని మిట్ట కండ్రికలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. సీసీ రోడ్లు, డ్రైన్లు, బోర్ల మరమ్మత్తులు చేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరడంతో తక్షణమే చేపడతామని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతూ మంచాలు పడ్డ ముగ్గురు వ్యక్తులకు సీఎం సహాయ నిధి నుంచి సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కంఠా రమేష్, రమేష్ బాబు, భాస్కర్ గౌడ్, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వకుళమాత ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం



ప్రజాశక్తి - రామచంద్రాపురం: పాతకాల్వ, పేరూరు బండపై వెలసిన వకుళమాత ఆలయానికి భక్తుల రాక పెరుగుతోందని, ఈ ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని టిటిడి చైర్మన్ బీ ఆర్ నాయుడు తెలిపారు. పేరూరు వకుళామాత ఆలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు అందుతున్న సౌకర్యాలు, క్యూ లైన్లు పరిశీలించారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన పనులపై నివేదిక తయారు చేయాలని టిటిడి అధికారులకు సూచించారు. తక్షణం చేపట్టాల్సిన పనుల వివరాలను తమ దృష్టికి తీసుకువస్తే టిటిడి బోర్డులో చర్చించి ఆమోదం తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏడాదిలో బలిజ భవన్ పూర్తి చేస్తాం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగరంలో ఉన్న పేద, మధ్యతరగతి బలిజ సామాజిక వర్గం వివిధ కార్యక్రమాలను నిర్వహించుకోవడానికి 2018 లో అప్పటి టిడిపి ప్రభుత్వం నగర పరిధిలోని నరసింహతీర్థం రోడ్డు మార్గంలో కేటాయించిన ఎ1.51 సెంట్లు స్థలంలో ఏడాదిలో బలిజ భవన్ నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని బలిజ భవన్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు వసంతం శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలిజ భవనం నిర్మాణానికి అప్పట్లో కాపు కార్పొరేషన్ నిధులనుండి రెండు కోట్ల రూపాయలు కేటాయిస్తామని ప్రకటించి రూ.37.98 లక్షల రూపాయలు విడుదల చేశారన్నారు. పిల్లర్ల స్థాయి వరకే నిర్మాణం జరిగిందని, అటు నుండి పూర్తిస్థాయి నిర్మాణం చేయడానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ప్రత్యేక చొరవతో సొసైటీ వారంతా కలిపి ఏడాదిలో పూర్తి చేయడానికి సలహాలు ప్రారంభించామన్నారు. మిగులు నిధులు రాబట్టడానికి నేడు సీఎం చంద్రబాబును కలిసి విన్నవిస్తామన్నారు. గత వైసిపి హాయంలో బలిజ భవనం నిర్మాణం ముందుకు సాగలేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బండ్ల లక్ష్మీపతి రాయల్, నాగరాజు రాయల్, శేఖర్, మురళి, చక్రపాణి, విజయ్ కుమార్, లీలా తదితరులు పాల్గొన్నారు.

యూరియా కరువు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: యూరియా కొరతతో అన్నదాత అల్లాడుతున్నాడు. ఈ సంవత్సరంలో మామిడికాయలకు ధర లేక ఊహించని విధంగా రైతు కుటుంబాల ఆదాయంపై దెబ్బ పడింది. కోలుకోలేని పరిస్థితి. ఇప్పుడు యూరియా లేక పొలంలో వేసిన పంట ఎదుగుదల లేక రైతు కుటుంబాలు నాన్న అవస్థలు పడుతున్నాయి. అన్నదాతలకు దెబ్బ పైన దెబ్బ పడడంతో కోలుకోలేని పరిస్థితి ఏర్పడిందని అన్నదాతలు వాపోతున్నారు. దీనికి తోడు మండలంలో ఉన్న గ్రోమోర్ సెంటర్లో రెండు బస్తాల యూరియా కావాలంటే .. కాంప్లెక్స్ ఒక బస్తా కొనుగోలు చేయాలని నిబంధనలతో కూడిన ఆఫర్లు పెడుతున్నారు. దీంతో ములిగే నక్కపై తాటిపండు పడిన చందంగా వుందని రైతు పేర్కొంటున్నాడు. వెదురుకుప్పం మండలంలో 25 పంచాయతీ లు ఉన్నాయి. ఇందులో 222 రెవెన్యూ గ్రామాలు . 80 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించే వారే అధికంగా ఉన్నారు. రైతులు తమ పంట పొలాల్లో వరి , చెరకు, వేరుశనగ, మామిడి, పశుగ్రాసం, కూరగాయలు, ఆకుకూరలు ఇలా వారికి నచ్చిన పంటలను పండిస్తూ ఉంటారు. వీటన్నిటికీ కాంప్లెక్స్, యూరియా వాడుతామని రైతులు పేర్కొంటున్నారు. పశువుల పేడ , మడి ఆకు ఎంత వేసినా పైకి మాత్రం యూరియా కొంతైనా వాడితే పైరు నల్లగా తిరుగుతుందని రైతులు చెబుతున్నారు.

దుకాణాల నిబంధనలు

మండలం లోని పచ్చికాపల్లంలో వ్యవసాయ రైతుల కోసం గ్రోమోర్ సంస్థను ఏర్పాటు చేశారు. రైతులకు కావలసిన అన్ని రసాయన క్రిమిసంహారక, ఎరువులు ఇక్కడ దొరుకుతాయి. గత నెల రోజులుగా యూరియా ఒక బస్తాన్ని రైతులకు ఇస్తున్నారు. రెండో బస్తా కావాలంటే ఆ రైతు మరొక కాంప్లెక్సును కొనుగోలు చేయాలి. ఈ కాంప్లెక్స్ రూ.1200 నుంచి రూ.2 వేల రూపాయలు వరకు ధర ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. అంత ధర వెచ్చించి రెండవ బస్తాను కొనుగోలు చేయలేమని గగ్గోలు పెడుతున్నారు. కొనుగోలు చేసినా ఆ కాంప్లెక్స్ వాడేది లేక ఇంట్లోనే గడ్డలు కట్టే పరిస్థితి ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిక్కుతోచని స్థితిలో రైతు కుటుంబాలు ఉన్నాయి. వరి పైరు మంచి పొట్ట దశ ఇప్పుడు యూరియా చల్లితేనే పంట దిగుబడి బాగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

రైతులు తిప్పలు వర్ణనాతీతం

ఒక యూరియా బస్తా సుమారు రూ.270 ఉంటుంది. గ్రోమోర్‌లో కృత్రిమ కొరత సృష్టించడంతో చేసేదేమీ లేక రైతులు పక్క రాష్ట్రమైన పళ్లిపట్టు నుంచి ఆటోలు, ఆర్టిసి బస్సుల సాయంతో వెదురుకుప్పం మండలానికి తెచ్చుకుంటున్నారు. ఇల్లు చేరే సరికి ఒక బస్తాకు రూ.330 వరకు ఖర్చు అవుతోందని రైతన్నలు చెబుతున్నారు.

మా బిడ్డను హత్య చేశారు..!

- కుటుంబ సభ్యుల ఆరోపణ
- న్యాయం చేయాలని నిరసన



ప్రజాశక్తి- కుప్పం: తమ బిడ్డను హత్య చేశారని, నిందితులను కనుగొని కఠినంగా శిక్షించాలని కోరుతూ మృతురాలి కుటుంబ సభ్యులు కుప్పం పట్టణ పోలీసు స్టేషన్ ముందు శుక్రవారం బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ దొమ్మర అగ్రహారం గ్రామంలో కాపురం ఉంటున్న పెరుమాళ్ భార్య ఇంద్రజ (25) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందని అయితే తమ బిడ్డను అదే గ్రామంలోని పాల డెయిరీలో పనిచేస్తున్న సత్తి కుమార్ హత్య చేశాడని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. తమ బిడ్డ చావుకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాని వారు డిమాండ్ చేశారు. న్యాయం కోసం వారు రోడ్డుపై బైఠాయించడంతో కాసేపు స్థానికంగా రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. వెంటనే స్పందించిన పట్టణ సిఐ శంకరయ్య ఇంద్రజ మృతిపై పూర్తి విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. పోలీసుల హామీతో బాధిత కుటుంబ సభ్యులు తమ ఆందోళనను విరమించుకున్నారు.

ఎర్రచందనం దుంగలు పట్టివేత

ప్రజాశక్తి - రొంపిచర్ల: ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న ఏడుగురు నిందితులను అరెస్టు చేశామని అటవీ శాఖాధికారులు శుక్రవారం తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు నాలుగు రోడ్ల కూడలిలో శుక్రవారం తెల్లవారు జామున పీలేరు డివిజనల్ అటవీ శాఖ అధికారి, సంచారదళ నిఘా విభాగం వారికి అందిన రహస్య సమాచారం మేరకు వాహనాలు శుక్రవారం ఉదయం తనిఖీ చేశారు. ఇదే సమయంలో మారుతి సుజుకి ఏపీ 03 ఎస్ 3913 వాహనంలో 13 ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తుండగా వాహనంలోనే దుంగలతో పాటు ఏడుగురిని పట్టుకున్నారు. పట్టుబడిన వ్యక్తులు తమిళనాడు కలువ రాయ్ మలైకు చెందిన ఏలుమలై, సెంథిల్, ఆన్బలగన్, రామన్, అన్నా దురై, కుప్పు స్వామి, మణిలుగా గుర్తిం చామన్నారు. నిందితులను విచారించగా ఎర్రచందనం దుంగలను శేషాచలం అటవీ ప్రాంతం నుంచి తరలిస్తున్నట్లు తెలిపారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. పట్టుబడిన ఎర్రచందనం దుంగలు విలువ కారుతో సహా 20 లక్షలు ఉంటుందని అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ దాడిలో డివిజనల్ అటవీ శాఖ అధికారి ఎం గురు ప్రభాకర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ చంద్రశేఖర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కె ప్రకాష్ కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు కె ప్రతాప్, పి రెడ్డి ప్రసాద్, నందీశ్వరయ్య, ప్రొటెక్షన్ వాచర్లు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-క్రాప్ చేసుకోండి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రైతులంతా విధిగా ఈ-క్రాఫ్ నమోదు చేసుకోవాలని శ్రీకాళహస్తి రూరల్ మండలం ఇనగలూరు వీఏఏ బి.బాలు సూచించారు. శుక్రవారం ఆయన ఇనగలూరు వ్యవసాయ క్షేత్రంలో పర్యటించారు. పంట నమోదుపై అవగాహన కల్పించారు. 2025-26 ఖరీఫ్ కు సంబంధించి తమ పొలాల్లో వేసిన పంటలను రైతులు తప్పకుండా ఈ పంట నమోదు చేయించుకోవాల్సిందిగా కోరారు. ధాన్యం కొనుగోలుకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే వ్యవసాయ పథకాలకు ఈ క్రాప్ నమోదు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. నమోదు కోసం పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డులతోటి రైతు సేవా కేంద్రాన్ని సంప్రదిస్తే చాలన్నారు.

తిరుపతి రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: గుంతకల్ డివిజన్ రైల్వే భద్రతదళానికి డివిజన ల్ సెక్యూరిటీ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించి న ఆకాష్ కుమార్ జైస్వాల్ తిరుపతి రైల్వే స్టేషన్‌కు విచ్చేశారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శ నం చేసుకొని, ఆర్పిఎఫ్ ఆఫీసు కార్యకలాపాల ను తనిఖీలు చేశారు. తదుపరి ఆర్పిఎఫ్ ఆఫీ సర్స్, సిబ్బందితో రెండు రోజుల క్రితం రైల్వే కోచ్‌లో జరిగిన అగ్నిప్రమాదం గురించి చర్చించారు. అగ్ని ప్రమాద సమయంలో సిబ్బంది చూపిన సమస్ఫూర్తికి, అక్కడ ఉన్న ప్రజలకు ఎటువంటి ఆపద



కానీయకుండా చూసుకున్నందుకు వారి కృషిని కొనియాడారు. విపత్తు సమయంలో ప్రతి ఒక్కరు కలిసిమెలిసి పనిచేయాలని వారి డ్యూటీలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల్ రెడ్డి అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ ఆఫ్ ఆర్పిఎఫ్, రేణిగుంట, సందీప్ కుమార్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఆర్పిఎఫ్ , తిరుపతి, వెంకటేశ్వర్లు ఇన్స్పెక్టర్ ఆఫ్ ఆర్పిఎఫ్ రేణిగుంట, ఎస్ఐలు వారి సిబ్బంది పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి

కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయ ఫోరం ధర్నా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ 2003 ఉపాధ్యాయ ఫోరం నేతృత్వంలో జిల్లా వ్యాప్తంగా 2003లో ఉపాధ్యాయ వృత్తిలో చేరిన ఉపాధ్యాయులు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా 2003 ఉపాధ్యాయ ఫోరం జిల్లా కన్వీనర్లు బోడె మోహన్ యాదవ్, ఢిల్లీ ప్రకాష్, మధు, శ్రీధర్, కోదండ రెడ్డి వెంకటేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయు లుగా 2003లో బాధ్యతలు స్వీకరించిన వారికి కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని అమలు చేయడం అత్యంత దారుణం అన్నారు. జీవో నెంబర్ 57 వెంటనే అమలు చేయాలని కోరారు. జీవో నెంబర్ 57 ప్రకారం ముగ్గురు ఐఏఎస్ అధికారులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసిన కేంద్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల విషయంలో మెలిక పెట్టడం సరికాదన్నారు. 2003 నుండి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని పోరాటం చేస్తు న్నట్లు తెలిపారు. 2003 ఉపాధ్యాయుల పోరాటానికి ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మణికంఠ, ఎస్టియు నాయకులు గంటా మోహన్, మదన్మోహన్ రెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు జీవి రమణ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం కలెక్టరుకు వినతిపత్రం అందించారు.